క్లుప్తంగా

ఇన్‌స్పెక్టర్‌కు ఆహ్వానం



బాచుపల్లి సీఐను ఆహ్వానిస్తున్న చెర్ల ఎల్లమ్మ ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు

నిజాంపేట్: నిజాంపేట్ జర్నలిస్ట్ కాలనీలోని చెర్ల ఎల్లమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాలను ఈనెల 17న నిర్వహిస్తున్నట్లు ఆలయ బోనాల ఉత్సవ కమిటీ తెలిపింది. ఆదివారం ఉత్సవాలకు రావాల్సిందిగా కోరుతూ బాచపల్లి సీఐకు ఉత్సవ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు. మధ్యాహ్నం 12గంటల నుంచి బోనాలు ప్రారంభమవుతాయని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని బోనాలు సమర్పించాలని కోరారు.

నవదుర్గామాతకు వెండి కిరీటం



వెండి కిరీటాలు బహూకరిస్తున్న జగన్ కుటుంబ సభ్యులు

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని సీసాల బస్తీలో ఇటీవలే ప్రతిష్ఠాపించిన నవదుర్గా మాతకు దేవి నవరాత్రుల సందర్భంగా ఆదివారం వెండి కిరీటాలు బహూకరించారు. మొక్కులో బాగంగా కిలో వెండితో చేపించిన రెండు కిరీటాలను కుటుంబ సభ్యులతో సహా వచ్చి కార్పొరేటర్ జగన్ ఆలయంలో సమర్పించారు. అమ్మవార్లకు అభిషేకం, అర్చనతో పాటు ప్రత్యేక పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో భగవద్గీత పారాయణం



నగర సంకీర్తనలో పాల్గొన్న భక్తజనం

చింతల్: భగత్‌సింగ్‌నగర్‌లోని శ్రీవీరాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం శ్రీధర్మశాస్త్ర సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ భగవానుడికి, అంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భగవద్గీత పారాయణం చేసి చిన్నారులకు భగవద్గీత ప్రాముఖ్యతను తెలియజేశారు. గీతా జయంతి రోజు సెలవు దినంగా ప్రకటించాలని కోరుతూ నగర సంకీర్తన నిర్వహించగా పెద్ద సంఖ్యలో భక్తులు, చిన్నారులు పాల్గొన్నారు.

18న 'మనూ'లో ఎగ్జిబిషన్-కమ్-సేల్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ధనక్ బజార్-ఎగ్జిబిషన్-కమ్ సేల్ ను ఈనెల 18వ తేదీన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు 'మనూ' లేడీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ ఎం వనజ ఆదివారం తెలిపారు. ఉర్దూ విశ్వవిద్యాలయం లేడీస్ అసోసియేసన్, ది సఫా ఎన్‌జీఓ సంస్థ ఆధ్వర్యంలో 18న ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఉర్దూ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో అందరికీ అందుబాటులో ఉండేలా నిర్వహిస్తామని వివరించారు. ఈ ఎగ్జిబిషన్‌ను యూనివర్శిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ చేతుల మీదుగా ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

అన్నమయ్యపురంలో నాదబ్రహ్మోత్సవ్

మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో ఆధివారం నాదబ్రహ్మోత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ శోభరాజు శిష్యురాలు దుర్గా సింధూర అన్నమయ్య కీర్తనలను ఆలపించి సందర్శకులను అలరించారు. ప్రముఖ నేపథ్య గాయకుడు కృష్ణ నిత్యపూజలివిగో, పొడగంటిమయ్య, నల్లనిమేని, నగవులు, నిజమని తదితరి శ్లోకాలను, గీతాలను ఆలపించి అలరిచారు. అన్నమయ్యభావన వాహిని వ్యవస్థాపకురాలు శోభరాజు కళాకారులకు సంస్థ జ్ఞాపికలను అందజేశారు.

ఉల్లంఘనలు.. ఎక్కడ ఎన్నికల కమిటీలు?



బాపూజీనగర్ సమీపంలో గోడపై బీజేపీ పోస్టర్

రంగారెడ్డినగర్: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా ఉల్లంఘనలు కొనసాగుతూనే ఉన్నాయి. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పకడ్బందీగా ఎన్నికల ఏర్పాట్లు పూర్తి చేసేందుకు 16 కమిటీలను నియమించారు. గోడలపై రాజకీయ పార్టీల రాతలు కనిపించకుండా పెయింటింగ్ వేయడం, గోడ పత్రికలను, రోడ్ల వెంబడి ఏర్పాటు చేసిన పార్టీ ఫ్లెక్సీలను తొలగించడం వీరి విధి. అయితే ఎక్కడికక్కడ ఉల్లంఘనలు జరుగుతున్నా సంబంధిత ఎన్నికల కమిటీ సభ్యులకు కనిపించకపోవడం శోచనీయం. పలు బస్తీలు, కాలనీల్లో ఇప్పటికి ఆయా పార్టీల ప్రచార పోస్టర్లు దర్శనమివ్వడం వారి పనితనాన్ని అద్దం పడుతోంది.



చింతల్ ప్రధాన రోడ్డు పక్కన దర్శనమిస్తున్న ప్రభుత్వ పథకం ప్రచార పోస్టర్



చింతల్ మార్కెట్ రోడ్డులోని కల్వర్ట్ బ్రిడ్జి సమీపంలో కాంగ్రెస్ పార్టీ పోస్టర్

వైభవంగా దేవీ శరన్నవరాత్రులు ప్రారంభం

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభయ్యాయి. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారు బాలా త్రిపుర సుందరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉపవాస దీక్షలో ఉన్న భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు వచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పలు ఆలయాల్లో చండీ హోమం నిర్వహించారు. – కుత్బుల్లాపూర్

కిటకిటలాడిన అమ్మవారి ఆలయాలు



బాలత్రిపుర సుందరిదేవి అలంకరణలో గాజులరామారం చిత్తారమ్మ దేవి, ఏపీహెచ్‌బీకాలనీ రేణుకాఎల్లమ్మ, సూరారం కట్టమైసమ్మ, జగద్గిరిగుట్ట కొండపై కాళికామాత



వైష్ణవి ఎన్‌క్లేవ్‌లోని శ్రీరేణుకాఎల్లమ్మను బాలత్రిపుర సుందరిదేవీగా అలంకరించి పూజలు



వేణుగోపాలస్వామి ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నేత కె.ఎం.ప్రతాప్



చిత్తారమ్మ ఆలయంలో పూజల్లో కూర్చున్న ఆలయ ఛైర్మన్ కూన అంతయ్యగౌడ్ దంపతులు



పేట్‌బషీరాబాద్‌లోని శ్రీకట్టమైసమ్మ ఆలయంలో చండీ హోమంలో పాల్గొన్న ఆలయ ఛైర్మన్ వివేక్‌రెడ్డి

కొలన్ హన్మంత్‌రెడ్డికే కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ టికెట్



దుండిగల్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కొలను హన్మంత్ రెడ్డి ఎంపికయ్యారు. పార్టీ అధిష్టానం ఆదివారం వెల్లడించిన మొదటి లిస్ట్‌లో హన్మంత్‌రెడ్డి పేరును ప్రకటించింది. గతంలో టీఆర్ఎస్ తరపున పోటీ చేసి ఓడిపోయిన ఆయన ఈసారి తన అదృష్టాన్ని పరిక్షించుకోనున్నారు.

రాజకీయ నేపథ్యం..

- మొదటి నుంచి నాయకత్వ లక్షణాలు కలిగిన కొలన్ హన్మంత్‌రెడ్డి విద్యార్థి దశలోనే నాయకుడిగా పేరు సంపాదించారు. బీకాం ఎల్ఎల్‌బీ చేసి కొన్నేళ్లగా న్యాయవాదిగా ప్రాక్టీస్ సైతం చేశారు.
- విద్యార్థి దశ నుంచే ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్‌లో పలు పదవులు అనుభవించారు. పలు కంపెనీల యూనియన్‌లకు కార్మిక నేతగా కొనసాగారు.
- 2001లో కుత్బుల్లాపూర్ నుంచి జెడ్పీటీసీగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు.
- 2006లో ఉమ్మడి కుత్బుల్లాపూర్ మండలం నుంచి ఎంపీటీసీగా గెలుపొంది అప్పటి ఎంపీపీ చినంగి వెంకటేశంపై అవిశ్వాస తీర్మానం పెట్టించి అందులో నెగ్గి 2011 వరకు కుత్బుల్లాపూర్ మండల పరిషత్ అధ్యక్షుడిగా పని చేశారు.
- 2014లో కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ దక్కకపోవడంతో టీఆర్ఎస్‌లో చేరి ఎమ్మెల్యేగా పోటీ చేసి 80వేలకు పైగా ఓట్లు సాధించి రెండో స్థానంలో నిలిచారు. అనంతరం తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వివిధ రాజకీయ సమీకరణాల నేపథ్యంలో కాంగ్రెస్ నుంచి టీడీపీ, బీజేపీలో చేరిన అనంతరం తిరిగి సొంత గూటికి చేరారు.

ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు..

కేహెచ్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పేద విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు, మహిళలకు కుట్టు మెషిన్లు అందజేశారు. సొంత స్థలంలో తన తండ్రి వెంకట్‌రాంరెడ్డి పేరు మీద కాలనీ ఏర్పాటు చేసి 70 మంది నిరుపేదలకు ఉచితంగా ఇళ్లు కట్టించి ఇచ్చారు.

కుటుంబ నేపథ్యం..

పేరు:	కొలను హన్మంత్‌రెడ్డి
భార్య:	కొలను నీరజ
పిల్లలు:	వెంకట్‌రాంరెడ్డి (డాక్టర్), మేఘనారెడ్డి(ఐఐటీ మద్రాస్)

హన్మంత్‌రెడ్డి ప్రకటనతో కార్యకర్తల్లో ఉత్సాహం

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కొలను హన్మంత్‌రెడ్డిని ఆ పార్టీ ప్రకటించడంతో కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది. టికెట్ ఆశించిన నర్సారెడ్డి భూపతిరెడ్డి పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటూ విజయం కోసం పనిచేయాలని ఆదివారం ముఖ్య కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. గతంలో అసెంబ్లీ, పలు పదవులకు పోటీ చేసిన అనుభవం ఉన్న వ్యక్తి హన్మంత్‌రెడ్డి కావడంతో ఆయనకు టికెట్ వరించిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో రెండు సంవత్సరాలుగా పలు సేవా కార్యక్రమాలతో పాటు పాదయాత్ర నిర్వహిస్తూ ముందుకు సాగుతున్న హనుమంత్‌రెడ్డి రానున్న రోజుల్లో మరింత దూకుడు పెంచే అవకాశం ఉంది. ఇప్పటికే అధికార బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా ఎమ్మెల్యే వివేకానంద ఎంపిక చేయగా, బీజేపీ మరో ఒకటి రెండు రోజుల్లో అభ్యర్థులను ప్రకటించే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. ఏది ఏమైనా కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించడంతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో రాజకీయ సందడి మొదలైంది.

జంగ్ 2023 తెలంగాణ

కాంగ్రెస్ 'రెబల్'గా సొంటిరెడ్డి

జగ్గారెడ్డి అనుచరుడుగా కొనసాగుతూ వచ్చిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి టికెట్‌పై ఆశలు పెట్టుకోగా అధిష్టానం ఆదివారం ప్రకటించిన జాబితాలో టికెట్ కేటాయించకపోవడంతో పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేసుకొని రెబెల్‌గా పోటీ చేసేందుకు నిర్ణయించినట్టు తెలిసింది. రెండు మూడు రోజుల్లో పూర్తి క్లారిటీ తీసుకున్న తర్వాతనే కార్యకర్తల అభిప్రాయాల మేరకు పోటీ చేయాలా వద్దా అన్న విషయంపై ఆలోచిస్తారని ఆయన సన్నిహితులు తెలిపారు.

ఇళ్ల కేటాయింపులో స్థానికులకు మోసం

నిజాంపేట్: స్థానికేతరులకు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించి స్థానికులను బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు మోసం చేశారని నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్‌ముదిరాజ్ ఆరోపించారు. ఆదివారం బాచుపల్లిలోని డబుల్‌బెడ్‌రూమ్ గృహ సముదాయం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ... నిజాంపేట్‌లో 2520 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించగా స్థానికులకు 50 శాతం ఇళ్లను కేటాయిస్తామని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ హామీ ఇచ్చారన్నారు. అయితే వాస్తవానికి 135 మందికే ఇళ్లు వచ్చాయన్నారు.

- గతంలో మల్లంపేట ఇందిరమ్మ ఇళ్ల కేటాయించిన మహిళకే మరోసారి డబుల్‌బెడ్‌రూమ్ ఇంటిని ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. కూకట్‌పల్లి, సనత్‌నగర్ నియోజకవర్గాలకు చెందిన ప్రజలకు నిజాంపేట్‌లో ఇళ్లు కేటాయించడం దారుణమని అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు తీరని అన్యాయం జరిగిందన్నారు.



ఇళ్ల కేటాయింపుపై విచారణ జరిపి అర్హులకు డబుల్‌బెడ్‌రూమ్‌లు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

- ఈ కార్యక్రమంలో మైనార్టీ మోర్చా మహిళా ప్రముఖ అమలేశ్వరి, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు రామచంద్రనాయక్, కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శి భిక్షపతి యాదవ్, కార్పొరేషన్ సెక్రటరీ అరుణ్, బీజేవైఎం అధ్యక్షుడు సాయిరెడ్డి, ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు కుమార్‌గౌడ్, 29వ డివిజన్ అధ్యక్షుడు సచిన్, అధికార ప్రతినిధి కౌశిక్ నాయుడు, ట్రేడర్ సెల్ కన్వీనర్ ఈశ్వర్‌రెడ్డి, 30 డివిజన్ అధ్యక్షులు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

హైటెక్స్ గ్రౌండ్స్‌లో గ్రీన్‌థాన్

మాదాపూర్: ప్రతి రోజూ వ్యాయామం చేయడం, కనీసం 8 గంటలు నిద్రపోవడం వల్ల అందరికీ తప్పని సరిగా అవసరమని కిమ్స్ ఆసుపత్రి సీఎండి డాక్టర్ బి.భాస్కర్‌రావు తెలిపారు. మాదాపూర్‌లోని న్యాక్ హైటెక్స్ గ్రౌండ్స్ వద్ద కార్పొరేట్ ప్రొఫెషనల్స్ ఫిట్ నెస్ , ఆరోగ్యకరమైన, చురుకైన జీవనశైలిని అవలంభించేలా ప్రోత్సహించడానికి ఆదివారం ఫ్లాగ్ షిప్ కార్పొరేట్ గ్రీన్‌థాన్‌ను నిర్వహించారు. సీఐఐతెలంగాణ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇందులో 3కె, 5కె, 10కె విభాగాలలో నడిచారు. గ్రీన్‌థాన్‌లో గెలుపొందిన విజేతలకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల విలువైన హెల్త్ కార్డులను ఇస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ బొలినేని భాసక్రరావు, టీఐఈ హైదరాబాద్ ప్రెసిడెంట్ మిస్ రషిదా అడేవాలా పాల్గొన్నారు.

100రోజుల ఆర్టీసీ పండుగ షురూ

రాయదుర్గం: పర్వదినాలను పురస్కరించుకొని 100 రోజుల టీఎస్ఆర్టీసీ పండుగను ఆరంభించినట్లు గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం మురళీధర్‌రెడ్డి పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ఆర్టీసీ డిపోలో ఉద్యోగులు, అధికారులతో కలిసి ఆయన ఆదివారం పండుగ సంబరాల పతాకాన్ని ఆవిష్కరించి సంబరాలపై వారికి వివరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం దసరా, దీపావళి, క్రిస్మస్, సంక్రాంతి పర్వదినాలు వరుసగా 100 రోజులలో ఉన్నాయని, ఈ సందర్భంగా సకాలంలో ప్రయాణికులు సురక్షితంగా గమ్యస్థానాలు చేర్చే బాధ్యత మనదేనన్నారు. హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ ట్రాఫిక్ ప్రశాంత్, సూపరింటెండెంట్ హెచ్ లక్ష్మీబాయి పాల్గొన్నారు.

బాచుపల్లిలో పిస్తాహౌస్



బాచుపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన పిస్తాహౌస్ రెస్టారెంట్‌ను ఆదివారం ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. మేనేజింగ్ పార్టనర్లుగా ఉన్న మాజీ కౌన్సిలర్ ఈవీసాగర్‌రావు, చౌడ శ్రీనివాస్‌రావులకు శుభాకాంక్షలు తెలిపారు. – కుత్బుల్లాపూర్

జనారణ్యంలోకి వానరాలు..

సుబాష్‌నగర్: అరణ్యంలో ఉండాల్సిన వానరాలు, జనార్యంలోకి రావడంతో ప్రజలు బెంబేలుత్తుతున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గండిమైసమ్మ, జీడిమెట్ల పారిశ్రామికవాడ, షాపూర్‌నగర్, సుచిత్రలలో కొన్ని రోజులు వానరాలు ప్రజల కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కుత్బుల్లాపూర్‌ను ఆనుకొని ఉన్న నర్సాపూర్ అటవీ ప్రాంతం నుంచి వానరాలు వచ్చి స్థానికంగా ఇళ్లలోకి, దుకాణాల్లోకి చొరబడి భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



షాపూర్‌నగర్‌లో జనవాసాల మధ్య తిరుగుతున్న వానరం

సంబంధిత అధికారులు దృష్టి సారించి వానరాలను అటవీ ప్రాంతానికి తరలించాలని కోరుతున్నారు.

రూ.51 లక్షల నగదు, విదేశీ మద్యం స్వాధీనం

గచ్చిబౌలి: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసుల తనిఖీలు ముమ్మరంగా సాగుతున్నాయి. మాదాపూర్ ఏసీపీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ మహేష్ ఆధ్వర్యంలో తనిఖీలు కొనసాగుతున్నాయి. ఈ తనిఖీలలో రూ.51 లక్షల నగదు, లక్ష రూపాయల విలువ చేసే ఇండియాలో తయారీ చేసిన విదేశీ మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకున్నారు.

తెలంగాణ అభివృద్ధి చెందాలంటే బీజేపీని గెలిపించాలి

బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: తెలంగాణ అభివృద్ధి చెందాలంటే బీజేపీని గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. గాజులరామారం డివిజన్ బీజేపీ నాయకుడు గుమస్తా మధుసూదన్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీరామ్‌నగర్ నాగదేవత ఆలయ ఛైర్మన్ నరేష్‌గౌడ్ తన అనుచరులతో పార్టీలో చేరగా శ్రీశైలంగౌడ్ వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనతో ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదని విమర్శించారు. కేవలం కేసీఆర్ కుటుంబ సభ్యులు, మంత్రులు బాగుపడ్డారన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబీలోకి దింపిన బీఆర్ఎస్‌కు ప్రజలే తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో అశోక్, మంగేష్, మధుగౌడ్, ఆకాశ్, నవీన్, సాయిబాబా, అర్జున్ తదితరులు పార్టీలో చేరారు.



నరేష్‌గౌడ్‌కు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

బీజేపీ పథకాలకు ఆకర్షితులై చేరుతున్నారు

జగద్గిరిగుట్ట: బీజేపీ పార్టీ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై యువకులు పార్టీలో చేరుతున్నారని మాజీ ఎమ్మెల్యే, పార్టీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ తెలిపారు. డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్పకు చెందిన సుమారు 60 మంది యువకులు ఆదివారం గాజులరామారంలోని బీజేపీ కార్యాలయంలో శ్రీశైలంగౌడ్ సమక్షంలో చేరారు. వీరికి బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పున్నారెడ్డి, మహేందర్, శేకర్, ప్రకాష్, చరణ్, ముకేష్, సంతోష్, సాయికిరణ్, ధరణేష్, సాయికుమార్, దత్తు, రామకృష్ణ, ప్రదీప్, శ్రీకాంత్, నందకిషోర్, సుదీర్, రాహుల్, మాధవ్, వినయ్, నిఖిల్, యోగేష్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారిని కండువా కప్పి ఆహ్వానిస్తున్న కూనా శ్రీశైలంగౌడ్

అభివృద్ధి పనులే నన్ను గెలిపిస్తాయి

ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: పదేళ్లుగా చేపట్టిన అభివృద్ధి పనులే తనను గెలిపిస్తాయని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. గాజులరామారం డివిజన్ పెద్దమ్మనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేకు పూర్తి మద్దతు ఉంటుందని పేర్కొంటూ ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని ఆయనకు అందజేసి సత్కరించారు. ముచ్చటగా మూడోసారి ఎమ్మెల్యేగా వివేకానంద్‌ను గెలిపించుకుంటామని బస్తీ వాసులు పేర్కొన్నారు. బస్తీ ప్రెసిడెంట్ అక్బర్ ఖాన్, సభ్యులు నవీన్, నగ్మా, జ్యోతి, రాము, శ్రీనివాస్, మనోహర్ తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే వివేకానంద్‌కు ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని అందజేస్తున్న పెద్దమ్మనగర్ సంక్షేమ సంఘం సభ్యులు

పొన్నాలపై రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు దారుణం

వైఎస్సార్‌టీపీ నేత దేశిరెడ్డి సురేష్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: మాజీ పీసీసీ అధ్యక్షుడు, బీసీ నాయకుడు పొన్నాల లక్ష్మయ్యపై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు దారుణంగా ఉన్నాయని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వైఎస్సార్‌టీపీ కో.ఆర్డినేటర్ దేశిరెడ్డి సురేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో తనకు జరుగుతున్న అన్యాయాలపై గళమెత్తి పార్టీ మారిన పొన్నాలను చచ్చే ముందు పార్టీ మారడమెందుకని రేవంత్‌రెడ్డి సభ్య సమాజం తలదించుకునేలా మాట్లాడారని మండిపడ్డారు. గతంలో పలు పార్టీలు మారిన ఘన చరిత్ర ఉన్న రేవంత్‌రెడ్డికి పొన్నాలను ప్రశ్నించే హక్కు లేదన్నారు.

- **పెయింటర్ నుంచి టీపీసీసీ అధ్యక్షుడివి ఎలా అయ్యావో ప్రజలకు తెలుసు**

పెయింటర్ స్థాయి నుంచి టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి ఎలా వచ్చాడో తెలంగాణ సమాజానికి తెలుసన్నారు. కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ టికెట్‌ను తనలాగే పార్టీలు మారిన వ్యక్తికి కట్టబెట్టాడని ఎద్దేవా చేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో వైఎస్సార్‌టీపీ సత్తా ఏమిటో త్వరలో జరిగే ఎన్నికల్లో అభిమానులు చాటిచెప్పనున్నారని పేర్కొన్నారు. తెలంగాణాలో కాంగ్రెస్‌కు సీట్లకు మించి రావని, రేవంత్‌రెడ్డి తక్షణమే బీసీలకు క్షమాపణలు చెప్పాలని, మల్కాజ్‌గిరి ఎంపీగా కుత్బుల్లాపూర్‌కు ఎన్నిసార్లు వచ్చాడో. ఏమి అభివృద్ధి చేవాడో చర్చకు రావాలని సవాల్ విసిగారు. వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల ఆదేశించిన వెంటనే తాను కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తానని సురేష్‌రెడ్డి తెలిపారు.

కుటుంబ పాలనను అంతం చేయాలి

కుత్బుల్లాపూర్: కుటుంబ పాలనను అంతం చేయాలంటే కాంగ్రెస్ పార్టీకి ఓటేయ్యాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. ఆదివారం గాజులరామారం డివిజన్ శ్రీరామ్‌నగర్‌కు చెందిన చర్చి ఆఫ్ క్రైస్ట్ సభ్యులు, చింతల్ డివిజన్ వివేకానంద్‌నగర్‌కు చెందిన వివిధ పార్టీల నాయకులు హన్మంతరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు హామీలను అమలు పరుస్తామన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ గాలి వీస్తోందని పలు పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని పేర్కొన్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు, స్థలం ఉన్న పేదలకు ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో కుత్బుల్లాపూర్‌లో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తేవాలన్నారు. డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రావణ్ కుమార్ ముదిరాజ్, అవిజె జేమ్స్, సిద్దనోళ్ల సంజీవరెడ్డి, బేకు శ్రీనివాస్, పండరి, యూసఫ్, శ్రీధర్‌రెడ్డి, నాగరాజు, మాజీ వార్డ్ మెంబెర్ గణేష్, శివకుమార్, శ్రీనివాస చారి, తులసి రెడ్డి, సంపంగి వెంకటేష్, దూలపల్లి ప్రసాద్, సల్మాన్ రాజ్, సందీప్ తదితరులు ఉన్నారు.



కొలన్ హన్మంతరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన వివిధ పార్టీల నాయకులు